క్లుప్తంగా

అతిసారం నిర్మూలనకు వైద్య శిబిరాలు

డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ



బాపట్ల: మండలంలోని పిన్నిబోయినవారి పాలెం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. గ్రామంలో అతిసారంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో గురువారం గ్రామాన్ని పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పంచాయతీరాజ్ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కలుషితం లేని నీటి సరఫరా చేయాలని ఆదేశించారు.

ఆర్‌బీకేల ద్వారా పంటల కొనుగోళ్లు

వేమూరు: రబీలో మినుము, పెసర సాగు చేస్తున్న రైతులు తమ పంటలను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత తెలిపారు. ప్రభుత్వం మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందని ఆమె చెప్పారు. రైతు భరోసా కేంద్రం ద్వారా మినుములు క్వింటా రూ.6,950, పెసర రూ.8,558 లకు కొనుగోలు చేయడం జరుగుతుందని వివరించారు. రైతులంతా తమ పంటలను రైతు భరోసా కేంద్రం ద్వారా అమ్ముకోవాలని సూచించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేత



అమృతలూరు(భట్టిప్రోలు): దివ్యాంగులకు దాతల సహకారం అభినందనీయమని అమృతలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దేవరపల్లి వెంకయ్య–దయమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రెండు ట్రై సైకిళ్లను సమకూర్చారు. వీటిని పక్షవాతం కారణంగా దివ్యాంగులుగా మారిన గరికపాటి వెంకటరత్నం, రేవెళ్ల పరిశుద్ధరావులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ రాము, మాజీ సర్పంచ్ కూచిపూడి సతీష్‌కుమార్, గుళ్లపల్లి ఎస్ఎంసీ చైర్మన్ మంచాల విజయకిషోర్, మండే కోటేశ్వరరావు, కొండమూరి భాస్కరరావు, దేవరపల్లి రామారావు, కె.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటును నిర్భయంగా వినియోగించుకోండి



రేపల్లె రూరల్: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని పట్టణ సీఐ నజీర్‌బేగ్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని పోలీసు అధికారులు మండలంలోని పేటేరు గ్రామంలో గురువారం నిర్వహించిన కవాతు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా తమ సిబ్బంది పని చేస్తారని చెప్పారు. ఓటర్లకు రక్షణ కల్పిస్తూ స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక దృష్టి సారించటం జరుగుతుందన్నారు. ఓటర్లను చైతన్యపరిచేందుకే కవాతును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేమవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం



వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు (పెదలంక సమితి) ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఫోకస్ ఐ హాస్పిటల్ (రేపల్లె) సహకారంతో స్థానిక శ్రీ సత్యసాయి భజన మండలి ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 56 మంది పెద్దలు, 18 మంది చిన్నారులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వికాస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ నారాయణమూర్తి, జిల్లా సీవోడీ కోఆర్డినేటర్ అందె రవి కుమార్, పెదలంక సమితి కన్వీనర్ బసవపూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్‌కు మద్దతుగా నిలుద్దాం

- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, బీజేపీ శ్రేణులు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, బీజేపీ వర్గీయులకు పార్టీ కండువాలు కప్పుతున్న వరికూటి

భట్టిప్రోలు: పిల్ల కాకులు ఎన్ని మాట్లాడినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు అంచంచల విశ్వాసంతో ఉన్నారని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు అన్నారు. గురువారం అమృతలూరు మండలం కూచిపూడిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీలోని కోళ్లపాలెంకు చెందిన కోలాటి నాంచారయ్య తరపున 10 టీడీపీ కుటుంబాలు, బీజేపీ మండల మాజీ కన్వీనర్ మాజేటి శివయ్య తరపున 3 కుటుంబాలు అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. పేదల పక్షాన యుద్ధం చేస్తున్న సీఎం జగన్‌కు రాబోయే ఎన్నికల్లో మనమంతా అండగా ఉండాలని వరికూటి కోరారు. గతంలో కమ్యూనిస్టు పార్టీలు పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఉద్యమాలు చేసిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. నేడు రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేకుండా చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 31 లక్షల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి పేదల పక్షపాతిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి), వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు వేల్పూరి బాల సుబ్రహ్మణ్యం(చిన్నారి), దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

సినీ రచయిత కోన వెంకట్



అక్కిరాజుదిబ్బ కాలనీలో ఎన్నికల ప్రచారంలో కోన వెంకట్

కర్లపాలెం: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకుందామని ప్రముఖ సినీ రచయిత, నిర్మాత, వైఎస్సార్ సీపీ నాయకులు కోన వెంకట్ అన్నారు. వైఎస్సార్ సీపీ బాపట్ల అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి, పార్లమెంటు అభ్యర్థి నందిగం సురేష్‌లకు మద్దతుగా బుధవారం కోన వెంకట్ వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి దుండివారిపాలెం, అక్కిరాజుదిబ్బ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి అనుమతి తీసుకుని ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ఎన్నికల కరపత్రాలను అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. మన రాష్ట్రంలో రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పందరబోయిన సుబ్బారావు, అమీర్‌బేగ్, అక్కల శ్రీనివాసరెడ్డి, మరకా పెద వెంకటేశ్వర్లు, ఆసిఫ్ అలీ, గొర్ల సుబ్బారావు, ఆట్ల నాగేశ్వరరెడ్డి, మరుప్రోలు శివారెడ్డి, పులుగు మునిచంద్రారెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, నాదెండ్ల భానుప్రసాద్, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, చిక్కాల సాగర్, పీవీ.సురేష్, పులుగు లక్ష్మారెడ్డి, పాములపాటి శ్రీనివాసరెడ్డి, షంషీర్, భావన్నారాయణ, గొర్రుముచ్చు మీరయ్య, దొంతిరెడ్డి శివారెడ్డి, పందరబోయిన శ్రీనివాసరావు, మనోహర్, సత్తార్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల మద్దతు వైఎస్సార్ సీపీకే

విభిన్న ప్రతిభావంతుల విభాగం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్



అశోక్‌బాబును కలిసిన బందెల కిరణ్‌రాజ్

భట్టిప్రోలు: విభిన్న ప్రతిభావంతుల మద్దతు వైఎస్సార్ సీపీకే నని విభిన్న ప్రతిభా వంతుల విభాగం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం కిరణ్‌రాజ్ అమృతలూరు మండలం కూచిపూడిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబును కలిశారు. 2024లో రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా, వేమూరు నియోజకవర్గంలో అశోక్‌బాబును ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం కోసం తమ వంతు కృషి చేస్తామని కిరణ్‌రాజ్ పేర్కొన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న పాలనలోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, అమృతలూరు మండలం పార్టీ కన్వీనర్ యలవర్తి సురేష్ బాబు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు కొంగర మంజరి చౌదరి, మాతంగి రత్నకుమార్, దావూరి నాగమల్లేశ్వరరావు, నీలా వాసు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముస్లిం సోదరుల ఉపవాస దీక్షలు

రంజాన్ పర్వదినం నిర్వహణకు ముస్తాబవుతున్న మసీదులు



భట్టిప్రోలులో ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా

భట్టిప్రోలు: ఈద్ సంబరాలకు ఈద్గాలు సిద్ధమయ్యాయి.ఏప్రియల్ 11న ఈద్-ఉల్ -ఫితర్ జరుపుకునేందుకు ముస్లింలు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది పండుగను ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రంజాన్ పండుగను పేద, ధనిక తేడా లేకుండా ముస్లింలు అంతా సమష్టిగా జరుపుకోవాలని ఇస్లాం సూచిస్తుంది. అందుకే ఉన్నవారు లేనివారికి ఫిత్రా రూపంలో దానం చేయాలని ఇస్లాం చెబుతోంది. ఈద్ నమాజ్‌కు వెళ్లే ముందు తప్పని సరిగా ఫిత్రా దానం చేయాలి. అప్పుడే ఈద్ నమాజ్ దైవామోదం అవుతుంది. అందుకే ఈ పండుగను ఈద్-ఉల్-ఫితర్ అని పిలుస్తారు. కుటుంబంలో ఎందరు సభ్యులు ఉంటే అందరి తరపున పేదలకు విధిగా దానం చేయవలసిందే. ఎలాంటి ఆటంకం లేకుండా 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు పూర్తి చేసినందున అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఫిత్రా దానం చేయాలి. దీంతో ఉపవాస సమయంలో వచ్చిన చెడు తలంపుల నుంచి మోక్షం లభిస్తుందని నమ్మకం. దువా (వేడుకోలు) ముగిశాక ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ చెప్పుకోవాలి. దీంతో మనుషుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు పెరుగుతాయని, అసూయా ద్వేషాలు సమసి పోతాయని భావిస్తారు. ఈద్ ప్రార్థనలు ముగిశాక ముస్లింలు తమ ముస్లిమేతర స్నేహితులను తమ ఇంటికి పిలిచి షీర్ ఖుర్మా తినిపిస్తారు. ఇది భిన్నత్వంలో ఏకత్వానికి సంకేతం.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

కర్లపాలెం: మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని ఎంఈవో విజయశ్రీ గురువారం తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రతి విద్యా సంవత్సరంలో 25 శాతం సీట్లు విద్యార్థులకు ఉచితంగా కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఓసీ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 6 శాతం, అనాథ, దివ్యాంగ, హెచ్ఐవీ బాధిత పిల్లలకు 5 శాతం సీట్లు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31లోపు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యుత్తు పొదుపుతో దేశ భవిష్యత్తు

రేపల్లె రూరల్: గృహాలలో గానీ, సంస్థలలో గానీ విద్యుత్ వృథాను అరికట్టాలని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ కే ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఎనర్జీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ పొదుపుతో దేశ భవిష్యత్ ముడిపడి ఉంటుందని, భవిష్యత్ తరాలకు ఉపయోగం చేకూరుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యుత్ పొదుపు అంశంపై విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని రక్షిత మంచినీటి సరఫరా పథకం మోటారు మరమ్మతులకు గురైన నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని సర్పంచ్ దారా రవికిరణ్మయి గురువారం తెలిపారు. ఈ రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా సరఫరా అయ్యే ప్రాంతాలకు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. విద్యుత్ మోటారు కాలిపోవడంతో సమస్య నెలకొందని తెలిపారు. కొత్త మోటారును శుక్రవారం బిగించి సాయంత్రానికి తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందని వివరించారు.

సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తెనాలిటౌన్: తెనాలి డివిజన్ పరిధిలో గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను సెలవు రోజుల్లో కూడా చెల్లించవచ్చని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చీరంజీవి తెలిపారు. శుక్ర, ఆదివారాల్లో విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీలో బిజినెస్ మోడల్ కాన్వాస్‌పై సదస్సు



మాట్లాడుతున్న అల్కవ్ పార్టనర్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసన్ శరవణ్ తదితరులు

గుంటూరు రూరల్: విద్యార్థి ఆలోచనలను అంకుర పరిశ్రమల స్థాపన వైపు దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవడం సులభతరం అవుతుందని అల్కవ్ పార్టనర్స్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసన్ శరవణ్ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆర్‌జేఈ నెస్ట్ సహకారంతో జరిగిన బిజినెస్ మోడల్ క్యాన్వాస్ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకుర పరిశ్రమలు ఏవిధంగా స్థాపించాలో వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యూబేషన్ కౌన్సిల్ సీఈఓ డైరెక్టర్ రవి ఈశ్వరపు, మేనేజర్ దినకర్ వాడపల్లిలు మాట్లాడుతూ అంకుర పరిశ్రమల స్థాపనలో వివిధ దశలను వివరిస్తూ, అది విజయాల దిశగా అభివృద్ధి సాధించడానికి అనుసరించాల్సిన పద్ధతులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థికి ఉద్యోగ ఆలోచనతో సాగే చదువు ఒకస్థాయి వరకే తీసుకెళ్తుందని, ఆ ఆలోచనతో పాటూ అంకుర పరిశ్రమల వైపు ఆలోచనలు విద్యార్థి భవిష్యత్తును మార్చి ఉన్నతస్థాయి చేరువకు దారి చూపుతాయని చెప్పారు. ఆ దిశగా విద్యార్థులను తయారు చేయడానికి కళాశాలలో ఇంక్యూబేటర్ సెంటర్ అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు విద్యతో పాటుగా న్యూ స్టార్టప్ శిక్షణను పొందటం వారి ఆలోచనలకు అనుగుణంగా వారు ఎంచుకున్న రంగాలలో విజయం పొందటానికి సాధ్యపడుతుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. నిపుణులచే నిర్వహించే సదస్సులలో శిక్షణ అందుకోవడం ద్వారా విద్యార్థుల మేధా శక్తిని, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: విద్యార్థులు అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అధ్యాపకుడు చేగూడి రంగారావుకు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. పవర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ మైక్రోగ్రిడ్ త్రూ ఆప్టిమల్ కంట్రోల్ ఆఫ్ రెన్యుబుల్ ఎనర్జీ సోర్సెస్ అనే అంశంపై డాక్టర్ ఆర్.బాలమురుగన్, డాక్టర్ రామకోటేశ్వరరావుల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరిరావు

వేమూరు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామ స్థాయి అధికారులు ఎన్నికల ప్రవర్తన నియామవళి పాటించాలని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలని చెప్పారు. రాజకీయ పార్టీకి గానీ అభ్యర్థికి గానీ అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే సందేహాలు, ఆరోపణలకు అస్కారమివ్వకూడదన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన కార్య కలాపాలల్లో వలంటీర్లు పాల్గొనరాదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నియమావళి అమలులో అలసత్వం వద్దు

కొల్లూరు : ప్రభుత్వ సిబ్బంది ఎన్నికల నిబంధనల అమలుపై దృష్టి సారించి నిరంతర పర్యవేక్షణ చేయాలని కొల్లూరు ఎంపీడీఓ లక్ష్మీకుమారి అన్నారు. గురువారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ, రెవెన్యు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నిబంధనలను పాటించే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాలలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నియమావళి అమలయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పుల్లారావు, ఈఓపీఆర్‌డీ రవిబాబు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖ ప్రారంభం



బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న చైర్మన్ టి కామేశ్వరరావు

బాపట్ల: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సేవలను విస్తృతం చేస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు పేర్కొన్నారు. బాపట్లలోని రైలుపేటలో కటావారివీధిలో బ్యాంకు 262వ శాఖను గురువారం ప్రారంభించారు. మార్కెట్ పరిస్థితులకు అతీతంగా సమాజంలో అన్నివర్గాల కష్టమర్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు డిపాజిట్లపై అత్యధికంగా 8.60% వడ్డీ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అందిస్తుందని తెలిపారు. విదేశాలలో ఉన్నత చదువుల కోసం బ్యాంకు గడిచిన 2 సంవత్సరాలలో 550 మంది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రూ.70 కోట్ల మేర విద్యా రుణాలను అందించిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం తీసుకు వచ్చిన పథకాలు అమలు చేయటంలో బ్యాంక్ నిర్విరామ కృషి చేస్తుందని వివరించారు. ఖాతాదారుల అవసరాలకు తగ్గట్టుగా లోన్ సదుపాయాలు అందుబాటులోకి తెస్తూ ఎనిమిది జిల్లాల్లో 27 లక్షల మంది ఖాతాదారుల అభిమానంతో బ్యాంకు రూ.22 వేల కోట్ల వ్యాపారం సాధించిందని చైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమానికి బ్యాంకు గుంటూరు రీజినల్ మేనేజర్ పీ.వీ రారెడ్డి, బ్యాంకు ప్లానింగ్ మేనేజర్ కె.ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ కృష్ణ చైతన్య, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

అసోసియేషన్ అధ్యక్షుడుగా గోపాలరావు ఎంపిక



బార్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్

రేపల్లె రూరల్: బార్ అసోసియేషన్ ఎన్నికలు పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ 2024–25 ఏడాదికి గానూ రేపల్లె బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలలో కేసన వెంకట గోపాలరావు ప్యానల్ ఘన విజయం సాధించిందన్నారు. అధ్యక్షుడుగా కేసన వెంకట గోపాలరావు, జనరల్ సెక్రటరీగా గరికపాటి వెంకట గిరిధర్, జాయింట్ సెక్రటరీగా ఒడుగు రాంబాబు, లైబ్రేరియన్‌గా కే.సంజయ్‌లు గెలుపొందారన్నారు. న్యాయవాదులు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. గెలుపొందిన వెంకట గోపాలరావు ప్యానల్‌కు నియామక పత్రాన్ని ప్రశాంత్‌కుమార్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకట గోపాలరావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలపై నిరంతరం కృషి చేయటం జరుగుతుందన్నారు.

గురువు జీవితం అతి పవిత్రమైనది

ఫాదర్ దిలీప్ కుమార్



ప్రత్తిపాడు: గురువు జీవితం ఎంతో పవిత్రమైనదని పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరివారి పుణ్యక్షేత్రంలో కథోలిక సభ గురువుల పండుగైన పవిత్ర గురువారం (పెద్ద బేస్తవారం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ కథోలిక సంఘంలో పనిచేస్తున్న క్రైస్తవ మత గురువులకు గుర్తుగా ఈరోజు పవిత్ర గురువారం పండుగ నిర్వహించామన్నారు. తోటి వారిని, శత్రువులను సైతం ప్రేమించాలని కోరారు. ఏసు ప్రభువు తన మరణానికి ముందురోజు శిష్యులతో కలిసి కడరా భోజనం చేశారని విశ్వాసులకు గుర్తు చేశారు. అనంతరం క్రీస్తు ప్రేమకు గుర్తుగా పన్నెండు మంది విశ్వాసుల పాదాలు కడిగారు. అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ పవన్, మఠకన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే సహించేది లేదు



రూట్ మార్చ్‌లో ఎస్ఐ కోటేశ్వరరావు, కేంద్ర బలగాలు

తెనాలిరూరల్: గ్రామాల్లో అలజడులు రేపితే సహించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. తెనాలి రూరల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు గురువారం మండలంలోని జాకీర్‌హుస్సేన్‌నగర్, హాఫ్‌పేట, ఖాజీపేట, ఎరుకలపూడి గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. కొల్లిపర మండలం అన్నవరపులంక గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు.